

తెలంగాణ భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు. చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్, నరేందర్‌రెడ్డి, గొంగిడి సునీత, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, గువ్వల బాలరాజు, భగత్‌కుమార్

బాబు జలచౌర్యం.. రేవంత్ చోద్యం

మొదటిపేజీ తరువాయి...

తరలించుకుపోతుంటే రేవంత్ ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. కేంద్ర బలగాల ఆధీనంలో ప్రాజెక్టు ఉన్నా.. నీటిచౌర్యం ఆగడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. మంత్రి ఉత్తమ్‌కు సాగునీటి రంగంపై కనీస అవగాహన లేదని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో గద్దెనెక్కిన కాంగ్రెస్, కేంద్రంలో బీజేపీకి రాష్ట్ర ప్రజల పట్ల కృతజ్ఞత లేదని మండిపడ్డారు.

సీఆర్పీఎఫ్‌ను ఉపసంహరించుకోవాలి

నాగార్జునసాగర్ ప్రాజెక్టుపై ఏర్పాటుచేసిన సీఆర్పీఎఫ్ బలగాలను వెంటనే ఉపసంహరించుకోవాలని, 2023 నవంబర్ 30 నాడు ఏ స్టేటస్‌లో ఉన్నదో, అదే స్టేటస్‌లో ఉండాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కాంగ్రెస్ చేతులు దులుపుకున్నదని, ఏడాది గడచినా ఇప్పటివరకు ఆధీనంలోకి తీసుకోలేదని హరీశ్‌రావు దుయ్యబట్టారు. ప్రాజెక్టు తెలంగాణ ఆధీనంలో ఉంటే ఏపీ సర్కారు ఇష్టారాజ్యంగా నీటిని తరలించుకుపోయే పరిస్థితి ఉండేది కాదని పేర్కొన్నారు. సీఆర్పీఎఫ్ బలగాలను తొలగించి, ప్రాజెక్టును అప్పగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని, చంద్రబాబును అడిగే దమ్ము, ధైర్యం సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రి ఉత్తమ్, కాంగ్రెస్ నేతలకు లేకుండా పోయిందని ధ్వజమెత్తారు.

సోయి లేని తెలంగాణ సర్కార్

ఏపీ రాష్ట్రం యథేచ్ఛగా కృష్ణజలాలను ఇష్టారాజ్యంగా తరలించుకుపోతున్నా, తెలంగాణ రాష్ట్ర సాగు, తాగు నీటి ప్రయోజనాలకు తీవ్ర నష్టం వాటిల్లుతున్నా కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వ పెద్దలు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. నీటి నిర్వహణలో, వినియోగంలో కాంగ్రెస్ సర్కారు ఘోరంగా విఫలమైందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కేంద్రాన్ని, బోర్డును ఎందుకు నిలదీయడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం కండ్లుమూసుకోవడంతో తెలంగాణలో లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని, వేసవిలో తాగునీటి సమస్య ఎదురయ్యే ప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తంచేశారు. తెలంగాణ ప్రయోజనాలు దెబ్బతింటున్నా బీజేపీ నేతలు కూడా స్పందించడం లేదని, రైతాంగం క్షేమం పట్టనివారికి పదవులెందుకని నిలదీశారు. తెలంగాణ సోయి లేని ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ఎంతటి నష్టం జరుగుతుందో కండ్ల ముందు కనబడుతున్నదని వాపోయారు.

ఇకనైనా కండ్లు తెరవండి

ఈ ఏడాదికి కృష్ణాలో 1,010 టీఎంసీల నీళ్లు వచ్చాయని, తాత్కాలిక ఒప్పంద ప్రకారమే అనుకున్నా ఏపీకి 666 టీఎంసీలు దక్కుతాయని, కానీ ఇప్పటికే 657 టీఎంసీలను వాడిందని, ఇంకా మిగిలింది కేవలం తొమ్మిది టీఎంసీలేనని హరీశ్‌రావు వివరించారు. అయినప్పటికీ, ఇవాళ కూడా సాగర్ కుడి కాల్వ నుంచి 10వేల క్యూసెక్కులు, పోతిరెడ్డిపాడు, ముచ్చుమర్రి నుంచి జలాలను యథేచ్ఛగా తరలిస్తున్నదని వివరించారు. తాత్కాలిక ఒప్పందం ప్రకారమే తెలంగాణకు 343 టీఎంసీల నీళ్లు రావాలని, ఇప్పటివరకు వాడుకున్నది 220 టీఎంసీలు మాత్రమేనని, ఇంకా రాష్ట్ర కోటాలో 123 టీఎంసీలు వినియోగించుకోవాల్సి ఉన్నదని తెలిపారు. ఏపీ, తెలంగాణ కోటాలు కలిపి మొత్తం 132 టీఎంసీలు అవసరమని వెల్లడించారు. సాగర్ ఎండీడీఎల్ 510 అడుగుల వద్ద 50 టీఎంసీలు, శ్రీశైలం ఎండీడీఎల్ 834 అడుగుల వద్ద మరో 50, మొత్తంగా రెండింటిలో కలిపి ప్రస్తుతం 100 టీఎంసీలు మాత్రమే అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఆ 100 టీఎంసీల జలాలను కూడా ఏపీ యథేచ్ఛగా తరలిస్తున్నదని, అయినప్పటికీ పట్టించుకోకుండా కాంగ్రెస్ గుడ్లు అప్పగించి చూస్తున్నదని, ఏపీ నుంచి తెచ్చుకున్న అడ్వైజర్ ఏం చేస్తున్నాడని, నీటి పారుదల శాఖ మంత్రి, ముఖ్యమంత్రి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా కండ్లు తెరవాలని, ఏపీని అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే సాగర్ ఎడమ కాల్వ కింద నల్లగొండలో 1.45 లక్షల ఎకరాలు, సూర్యాపేటలో 2.35 లక్షల ఎకరాలు, ఖమ్మంలో 2 లక్షలపైగా ఎకరాలు, మొత్తంగా 6.38 లక్షల ఎకరాలు, ఏఎంఆర్ ఎస్ఎల్బీసీ కింద సాగుచేస్తున్న 2.4 లక్షల ఎకరాలకు సాగునీరందని పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తంచేశారు. ఇంకా నాలుగు తడుల నీళ్లు ఇస్తే గాని పంటలు పండబోవని, దాదాపు 30, 35 టీఎంసీల నీళ్లు కావాల్సి ఉంటుందని వివరించారు. వచ్చే సీజన్ వరకూ ఖమ్మం, మహబూబాబాద్, నల్లగొండ, సూర్యాపేట, హైదరాబాద్ తాగునీటి అవసరాలను తీర్చాల్సి ఉంటుందని తెలిపారు. రైతుల పంటలు పండాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా కండ్లు తెరవాలని, కేంద్రం మీద ఒత్తిడి తీసుకొచ్చి ఏపీ జలదోపిడీని అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. 'నీళ్లను సాధించండి.. అది చేతగాకుంటే అఖిలపక్షాన్ని తీసుకుపోండి' అని సూచించారు. లేఖలు రాస్తే పనులు కావని, కేఆర్ఎంబీ ఆఫీసు, ఢిల్లీలో కేంద్ర జల్‌శక్తిశాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేద్దాం పదండి, తామూ వస్తామని తెలిపారు. కాంగ్రెస్‌ను గెలిపించింది పంటలు ఎండగొట్టడానికా, తాగు నీటి కోసం ప్రజలు గోస పడడానికా? అనినిలదీశారు. ఇది ముమ్మాటికి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమని, ఏపీ సీఎం చంద్రబాబుకు రేవంత్‌రెడ్డి పరోక్షంగా సహరిస్తున్నారని, గురుదక్షిణ చెల్లించుకుంటున్నారని, రేవంత్ ఇక్కడ అధికారంలో ఉండటంతో నీటి తరలింపు సులువైందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు.

ఏపీ కంట్రోల్‌లో బోర్డు

కాంగ్రెస్, బీజేపీ నుంచి చెరో 8 మంది చొప్పున ఎంపీలు గెలిచి తెలంగాణకు ఏం ప్రయోజనమని, పార్లమెంట్‌లో ప్రశ్నించేవారే లేకుండా పోయారని హరీశ్‌రావు మండిపడ్డారు. కాంగ్రెస్‌కు తెలంగాణ సోయి లేకుండా పోయిందని, బీజేపికి పట్టింపులేదని, రెండు పార్టీలు కలిసి తెలంగాణకు అన్యాయం చేస్తున్నాయని నిప్పులు చెరిగారు. కేంద్రంలో తనకున్న తిరుగులేని బలం వల్లనే చంద్రబాబు ఇష్టారీతిన జలదోపిడీ చేస్తున్నారని, తెలంగాణ ముఖ్యమంత్రి దానిని ప్రశ్నించకుండా, అడ్డుకోకుండా పరోక్షంగా సహకరిస్తున్నారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డికి త్రిసభ్య కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసేంత సత్తా కూడా లేకుండా పోయిందని ధ్వజమెత్తారు. బోర్డు కేంద్రం కంట్రోల్‌లో ఉన్నదా, ఏపీ కంట్రోల్‌లో ఉన్నదా? అనే అనుమానం వస్తున్నదని, కేంద్రం రెండు రాష్ట్రాలను ఎందుకు సమానంగా చూడటం లేదని మండిపడ్డారు. త్రిసభ్య కమిటీ మీటింగ్ పెట్టకుంటే రాష్ట్ర ప్రభుత్వమైనా ఎందుకు డిమాండ్ చేయడం లేదని నిలదీశారు. బోర్డుపై ఒత్తిడి చేయరు, మీటింగ్ పెట్టమని డిమాండ్ చేయరు. నీళ్లు తరలిస్తుంటే శిలా విగ్రహాల్లాగా ఉంటున్నారని, ప్రేక్షకపాత్ర వహించడానికా ఎన్నుకుందని దుయ్యబట్టారు.

ఢిల్లీ పోదాం పదా..

బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు చణాకా కొరటా, చిన్నకాళేశ్వరం, గూడెం ప్రాజెక్టులకు ఇలా అనుమతులు తెచ్చామని హరీశ్‌రావు గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతులు కాదు కదా, చివరి దశలో ఉన్న ప్రాజెక్టుల అనుమతులను సాధించడంలోనూ విఫలమైందని విమర్శించారు. బీఆర్ఎస్ చివరిదశ వరకు తీసుకువచ్చిన అనేక డీపీఆర్‌లు కూడా కాంగ్రెస్ చేతగానితనం వల్ల వాపస్ వస్తున్నాయని ధ్వజమెత్తారు. పాలమూరు రంగారెడ్డి, వార్ధా, కాళేశ్వరం మూడో టీఎంసీ, సీతారామ ప్రాజెక్ట్ డీపీఆర్‌లను ఉదహరించారు. సమ్మక్క సాగర్ డీపీఆర్ పరిస్థితి అట్లనే ఉన్నదని, ప్రాజెక్టులకు అనుమతులు తేరు, ఉన్న నీటి కేటాయింపులను సక్రమంగా వినియోగించడంలేదని మండిపడ్డారు. ఉద్దేశపూర్వకంగా మేడిగడ్డను పడావు పెడుతున్నారని, గట్టిగ చేస్తే ఆరు నెలల్లో చేసే పని, కాళేశ్వరం కూలిపోయిందని దొంగ ప్రచారం చేస్తున్నారని నిప్పులు చెరిగారు. కాళేశ్వరం ఏడు బ్లాకుల్లో ఒక బ్లాకులో ఒక పియర్ కుంగిందని, దానిని రిపేర్ చేయకుండా ప్రభుత్వం చోద్యం చూస్తున్నదని మండిపడ్డారు. రైతులు నీటి కోసం ధర్నాలు చేసున్నా పట్టించుకోకుండా వారి నోట్లో మట్టి కొడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇకనైనా నీళ్లను సాధించండి.. లేదంటే రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాటం చేయాలి, అందుకు బీఆర్ఎస్ కలిసి వస్తుందని చెప్పారు. అవసరమైతే అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లాలని, కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని, తెలంగాణ ప్రయోజనాలను కాపాడాలని కోరారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, నోముల భగత్, గొంగడి సునీత పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డీ.. మీకు పదవులెందుకు?

ఏపీ జలదోపిడీ బీజేపీకి కనిపించడం లేదా? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. మన నీళ్లు తరలిపోతుంటే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఏం చేస్తున్నారని మండిపడ్డారు. పార్లమెంట్‌లో బీఆర్ఎస్‌కు ప్రాతినిధ్యం ఉంటే.. కేంద్రం గల్లా పట్టి రాష్ట్రం హక్కులపై పోరాడేదని స్పష్టంచేశారు. కృష్ణా బోర్డు కేంద్రం పరిధిలోనే ఉన్నదని, మీరు ఆర్డర్ వేస్తే ఏపీకి తరలిపోతున్న నీళ్లు ఆగవా? అని ప్రశ్నించారు. ఇకనైనా స్పందించకపోతే సికింద్రాబాద్ ప్రజలు కూడా తాగు నీటి సమస్య ఎదుర్కుంటారని హెచ్చరించారు. సాగర్‌పై సీఆర్పీఎఫ్ బలగాలను తక్షణం తొలగించాలని, లేదంటే శ్రీశైలంలో కూడా ఏర్పాటుచేయాలని కిషన్‌రెడ్డిని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను ఉపయోగపడని పదవులు ఎందుకని ప్రశ్నించారు. సందర్భాన్ని బట్టి స్పందించాలని, కిషన్‌రెడ్డి చొరవ చూపి తెలంగాణ ప్రయోజనాలు కాపాడేలా చూడాలని డిమాండ్ చేశారు.

చేవచచ్చిన కాంగ్రెస్ సర్కారు

నాగార్జునసాగర్ కుడి కాల్వ నుంచి ఏపీ ప్రభుత్వం గత మూడు నెలలుగా నాగార్జునసాగర్ కుడి కాలువ నుంచి రోజుకు పది వేల క్యూసెక్కుల చొప్పున నీళ్లను తరలించుకుపోతున్నా తెలంగాణ ప్రభుత్వం చేవచచ్చి, చేష్టలుడిగి చేతులు కట్టుకొని చూస్తున్నదని, నీళ్ల మంత్రి నీళ్లు నములుతున్నాడని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. కృష్ణా జలాల్లో ఏపీ తాత్కాలిక వాటా 512 టీఎంసీలు కాగా, ఇప్పటికే 657 టీఎంసీలు తరలించిందని, అయినప్పటికీ ముఖ్యమంత్రి, నీటి పారుదల శాఖ మంత్రి బెల్లంకొట్టిన రాళ్లలాగా చలనం లేకుండా పడి ఉన్నారని, నోరు పెగలడం లేదని తూర్పారపట్టారు. గడిచిన 25 రోజుల్లోనే 60 టీఎంసీలను అంటే రోజుకు రెండు టీఎంసీలను ఏపీ తరలించిందని, ఇక కాంగ్రెస్‌ను ఎన్నుకున్నది ఎందుకని నిలదీశారు.

బాబుగారి చిలుక పలుకులు

- నీళ్లన్నీ మళ్లించి ఇప్పుడు సుద్దులు
- రాజకీయాలు తగవంటూ సన్నాయినొక్కులు
- రిజర్వాయర్లను ఖాళీ చేస్తూ వృథా జలాలంటూ బుకాయింపు

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్ ఒకవైపు ఎడాపెడా ఎగువన, దిగువన కృష్ణా జలాలను ఇష్టారాజ్యంగా మళ్లించింది. ఇప్పటికీ యథేచ్ఛగా పెన్నా బేసిన్‌కు తరలిస్తున్నది. తాత్కాలిక కోటాకు మించి ఇప్పటికే జలాలను వినియోగించుకున్నది. కానీ ఆ రాష్ట్ర సీఎం చంద్రబాబు మాత్రం వృథా జలాలనే తరలిస్తున్నామని, సున్నితమైన అంశంపై రాజకీయాలు తగవంటూ చిలుక పలుకులు పలుకుతున్నారు. బేసిన్ చివరలో ఉన్నామని, వృథాగా పోయే జలాలను మళ్లిస్తున్నామంటూ బుకాయించడం గమనార్హం. ఈ ఏడాది కృష్ణా నుంచి 850 టీఎంసీలకుపైగా సముద్రంలో కలిశాయి. అవిపోను దాదాపు 1,010 టీఎంసీలు ఇరు రాష్ట్రాలు వినియోగించుకునేందుకు అందుబాటులోకి వచ్చాయి. తాత్కాలిక కోటా ప్రకారం అనుకున్న మేరకు జలాలను ఏపీ మళ్లించుకున్నది. అటు పెన్నా బేసిన్‌లో దాదాపు 350 టీఎంసీలను నిల్వ చేసుకున్నది. దిగువన పులిచింతల, ప్రకాశం బరాజ్‌లోనూ దాదాపు 50 టీఎంసీలకుపైగా నీటినిల్వలున్నాయి. అయినప్పటికీ ఇప్పటికీ ఉమ్మడి రిజర్వాయర్లలో జలాల్లో వాటా కోరుతున్నది. ఇదెక్కడి అన్యాయమని, తెలంగాణ రైతాంగానికి తీరని నష్టం వాటిల్లుతుందని ప్రశ్నించగానే, ఇది సున్నితమైన అంశం అంటూ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు ఏపీ సీఎం చంద్రబాబు. నిరాటంకంగా జలదోపిడీకి పాల్పడి, తెలంగాణ ప్రయోజనాలను దెబ్బతీయడమే గాక వాటిపై రాజకీయాలు తగవంటూ చంద్రబాబు చిలుకపలుకులు పలకడం ఇప్పుడు తెలంగాణ నీటిరంగ నిపుణుల్లో తీవ్ర ఆగ్రహాన్ని కలిగిస్తున్నది. ఈ ఏడాది ఏపీ చేసిన జలదోపిడీని గణాంకాలతో సహా మాజీ మంత్రి హరీశ్‌రావు బట్టబయలు చేశారు. తెలంగాణ రైతాంగం పక్షాన ఏపీని, ఇటు కాంగ్రెస్ సర్కారును సైతం నిలదీశారు. తెలంగాణ ప్రయోజనాలను దెబ్బతీస్తే ఊరుకునేది లేదని తేగేసి చెప్పారు. ఈ అంశంపై ఢిల్లీ పర్యటనలో ఉన్న చంద్రబాబు స్పందిస్తూ.. నీరు వంటి సున్నితమైన అంశాలపై రాజకీయలు చేయడం సరికాదంటూ మాట్లాడటం గమనార్హం. తెలంగాణ, ఆంధ్ర రెండు రాష్ట్రాలు కూడా గోదావరి జలాలను ఉపయోగించుకోవాలని, కృష్ణా జలాల విషయంలోనే కొంత సమస్య ఉన్నదని చంద్రబాబు వివరించారు. కోటా మేరకే ఏపీ జలాలను ఉపయోగించుకుంటున్నదని వెల్లడించారు. అయితే చంద్రబాబు వ్యాఖ్యలపై తెలంగాణ సమాజం తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నది. తెలంగాణ ప్రయోజనాలను దెబ్బతీయం, రైతాంగానికి తాగునీరు, సాగునీరు లేకుండా చేయడం సున్నితమైన అంశం కాదా? జలదోపిడీని ప్రశ్నించవద్దా? అంటూ నీటిరంగని పుణులు మండిపడుతున్నారు. ప్రాజెక్టులన్నీ నిండి పొంగిపొర్లుతున్న సమయంలో నీటిని మళ్లించవచ్చని, కానీ ప్రస్తుతం కృష్ణాలో ప్రవాహాలేవీ లేని సమయంలోనూ ఇష్టారాజ్యంగా నీటిని మళ్లిస్తూ, మరోవైపు వృథా జలాలు అంటూ మాట్లాడటంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. జలదోపిడీకి పాల్పడుతూ, తెలంగాణ ప్రయోజనాలను దెబ్బతీస్తూ, ఆ అన్యాయాన్ని నిలదీస్తే రాజకీయాలు తగవంటూ సుద్దులు చెప్పడమే విడ్డూరంగా మారిందని నీటి రంగనిపుణులు విమర్శిస్తున్నారు. తెలంగాణ ప్రయోజనాలను ప్రశ్నించవద్దా? అన్యాయం చేస్తున్నా చూస్తూ ఊరుకోవాలా? ఏపీ జలదోపిడీకి హారతులు పట్టాలా? అని తెలంగాణ నీటి రంగ నిపుణులు నిలదీస్తున్నారు.

పడవాటి నీళ్లను లెక్కించాలి

- శాస్త్రీయ పద్ధతుల్లో నీటి అవసరాలను అంచనా వేయాలి
- బేసిన్‌లోని రాష్ట్రాల డిమాండ్లు తీర్చాలి
- ట్రిబ్యునల్ ఎదుట తెలంగాణ వాదనలు

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ): కృష్ణా బేసిన్‌లో తెలంగాణ ప్రాంతం నుంచి కృష్ణాలోకి వెళ్లే పడవాటి జలాలను లెక్కించాలని తెలంగాణ గురువారం బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్‌కు నివేదించింది. కేంద్ర ప్రభుత్వం జారీచేసిన సెక్షన్-3 మార్గదర్శకాల మేరకు ఇరు రాష్ట్రాల మధ్య కృష్ణాజలాల పునఃపంపిణీకి సంబంధించి బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ విచారణ రెండవరోజైన గురువారం కూడా కొనసాగింది. ట్రిబ్యునల్ చైర్మన్ జస్టిస్ బ్రిజేశ్‌కుమార్, సభ్యులు జస్టిస్ రామ్మోహన్‌రెడ్డి, జస్టిస్ ఎస్ తలపాత్ర తెలంగాణ వాదనలను విన్నారు. తెలంగాణ సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ పలు అంశాలను ట్రిబ్యునల్‌కు నివేదించారు. కావేరీ ట్రిబ్యునల్ అవార్డుపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగా తెలంగాణ తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. కావేరి, కృష్ణా బేసిన్ల మధ్య కొన్ని సారూప్యతలు ఉన్నాయని, రెండూ నీటి కొరత ఉన్న బేసిన్లేనని, సరఫరా కంటే డిమాండ్లు ఎక్కువగా ఉన్నాయని వివరించారు. ఆల్మట్టి, నారాయణపూర్, తుంగభద్ర డ్యాం నుంచి గ్రావిటీ ద్వారా కాలువ వ్యవస్థను ముందుగా చేపట్టి ఉంటే, నీటిపారుదల రంగంలో తెలంగాణ ప్రయోజనం పొందగలిగేదని చెప్పారు. బేసిన్ ప్రాంతంలోని రైతులకు కనీసం ఒక్క పంటకైనా సాగునీరు అందుబాటులో ఉంచవచ్చని కావేరీ ట్రిబ్యునల్ సూచించిందని గుర్తుచేశారు. కావేరీ ట్రిబ్యునల్ సూచించిన శాస్త్రీయ పద్ధతుల ఆధారంగా సాంబ రకం వరి ధాన్యం స్థానంలో స్వల్పకాలిక రకాన్ని ప్రవేశపెట్టడం, తక్కువ నీరు అవసరమయ్యే పంటలను పండించడం, వాస్తవిక పంట నీటి అవసరాన్ని అంచనా వేయాలని తెలిపారు. తెలంగాణ ప్రాంతంలో ఉత్పత్తి అయ్యే పడవాటి నీళ్లను తెలంగాణ ప్రాజెక్టులకు ఇవ్వాల్సి ఉన్నా, పూర్వపు ఆంధ్రప్రదేశ్ ఆంధ్ర ప్రాంతానికి కేటాయించిందని గుర్తుచేశారు. పడవాటి నీళ్లను లెక్కించి తెలంగాణకు కేటాయించాలని ట్రిబ్యునల్‌ను కోరారు.

నేడు కేఆర్ఎంబీ అత్యవసర భేటీ

కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు అత్యవసరంగా శుక్రవారం సమావేశం కానున్నది. ఆంధ్రప్రదేశ్ తన వాటాకు మించి కృష్ణా జలాలను ఈ ఏడాది మళ్లించుకుపోయింది. ఏపీని నిలువరించాలని బోర్డును కోరినా ఇప్పటివరకు స్పందించలేదు. ప్రస్తుతం ఇదే అంశంపై రాజకీయ దుమారం రేగుతున్నది. ఈ నేపథ్యంలో సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బోర్డు చైర్మన్ అతుల్‌జైన్‌తో గురువారం మధ్యాహ్నం భేటీ అయ్యారు. నీటివాటాల అంశంపై చర్చించారు. ఈ నేపథ్యంలో బోర్డు శుక్రవారం అత్యవసరం సమావేశం నిర్వహించాలని నిర్ణయించింది. నీటివాటాల కేటాయింపు, డిమాండ్లు తదితర అంశాలపై చర్చించే అవకాశం ఉన్నది. సీడబ్ల్యూసీ చైర్మన్ ఎంకే సిన్హా కూడా సమావేశానికి హాజరయ్యే అవకాశం ఉన్నట్టు సమాచారం.

ఇంద్రజిత్ గుప్తాకు ఘన నివాళి

పుష్పాంజలి ఘటించిన కూనంనేని

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ): సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఇంద్రజిత్ గుప్తా 24వ వర్ధంతి సందర్భంగా గురువారం ఆ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు.

శ్రీవారి ఆలయంపై మరోసారి విమానం

విచారణకు ఆదేశించిన ఏపీ హోంమంత్రి

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ): తిరుమల శ్రీవారి ఆలయంపై నుంచి గురువారం మరోసారి విమానం వెళ్లడం కలకలం సృష్టించింది. ఆగమశాస్త్ర నిబంధనల ప్రకారం శ్రీవారి ఆలయంపై నుంచి విమానాలు రాకపోకలు సాగించకూడదు. ఇలా తరచూ శ్రీవారి ఆలయంపై నుంచి విమానాలు వెళ్లడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తిరుమల గోపురంపై నుంచి విమానాలు వెళ్లడంపై టీటీడీ ఇప్పటికే పలుసార్లు కేంద్రవిమాన యాన శాఖకు విజ్ఞప్తి చేసింది. తిరుమల శ్రీవారి ఆలయం సమీపంలో కాకుండా తిరుమల గగనతలం, ఇతర ప్రదేశాల నుంచి విమానాల రాకపోకలు సాగించాలన్న టీటీడీ వినతులు విమాన యాన శాఖ పట్టించుకోలేదన్న విమర్శలు న్నాయి. ఘటనపై ఏపీ హోంమంత్రి అనిత స్పందించి దర్యాప్తునకు ఆదేశించినట్టు తెలిపారు.

బార్ కౌన్సిల్ చైర్మన్‌కు రాజీనామా పత్రాలు సమర్పిస్తున్న సభ్యులు మోహన్‌రావు, శంకర్

బార్ కౌన్సిల్ సభ్యుల రాజీనామా

ఎన్నికలు నిర్వహించకపోవడాన్ని నిరసిస్తూ నిర్ణయం

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ): కాలవ్యవధి ముగిసినా ఎన్నికలు నిర్వహించకపోవడాన్ని నిరసిస్తూ ఇద్దరు బార్ కౌన్సిల్ సభ్యులు తమ పదవులకు గురువారం రాజీనామా చేశారు. సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు, మరో సభ్యుడు న్యాయవాది బీ శంకర్ తమ రాజీనామాను బార్ కౌన్సిల్ చైర్మన్ ఏ నరసింహారెడ్డికి సమర్పించారు. సాధారణ కాలపరిమితి రెండేండ్లు కాగా.. దాన్ని ఐదేండ్లకు పెంచారని, ఆ కాలపరిమితి కూడా ముగిసి రెండేండ్లు పూర్తయిందని వివరించారు. గడువు తీరినా ఎన్నికలు నిర్వహించకుండా అదే పాలకవర్గం కొనసాగడం అప్రజాస్వామికమని, అందుకే సభ్యత్వాలకు రాజీనామా చేస్తున్నట్టు చెప్పారు. తెలంగాణ బార్ కౌన్సిల్‌కు ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో చెప్పాలని గత నెల హైకోర్టు ఆదేశించినప్పటికీ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సమాధానం చెప్పలేదు. దీంతో రెండు రోజుల క్రితం జరిగిన హైకోర్టు విచారణ సందర్భంగా జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నెల 25కి విచారణను వాయిదా వేశారు. ఎన్నికల షెడ్యూల్‌తో విచారణకు రావాలని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను ఆదేశించారు. కౌన్సిల్‌లో 25 మంది సభ్యులు ఉండగా.. వీరిలో 24 మంది ఎన్నికవుతారు.

- రెండో ఏఎన్ఎంల సమ్మె తాత్కాలిక విరమణ

రెండో ఏఎన్ఎంలు తాత్కాలికంగా సమ్మె విరమించినట్టు ఏఐటీయూసీ రాష్ట్ర ఉప కార్యదర్శి ఎం నరసింహ ప్రకటించారు. రెండో ఏఎన్ఎంల యూనియన్(ఏఐటీయూసీ), రాష్ట్ర వైద్య వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ కర్ణన్‌తో జరిగిన చర్చల్లో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. గురువారం కోఠిలోని కమిషనర్ కార్యాలయంలో జరిగిన చర్చల అనంతరం ఆయన మాట్లాడారు. 38 రకాల రికార్డులను రాయడంతో పాటు ఆన్‌లైన్ చేయాల్సి రావడంతో ఏఎన్ఎంలపై పని ఒత్తిడి పెరుగుతున్నదని పేర్కొన్నారు.

లోకం పోకడ

'టీ'లో షుగర్ ఉండాలా? వద్దా? అనడిగితే 'టీ'స్టాల్‌లో కేటీఆర్ ఫొటోలు వద్దంటారేం? ఇదేం కొత్త జబ్బుసార్!

జలసౌధలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో మంత్రులు పొన్నం, కోమటిరెడ్డి

నీటిహక్కులను కాపాడేందుకు కృషి చేస్తున్నాం

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర నీటి హక్కులను కాపాడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. ఏపీ జలదోపిడీని అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందనే విమర్శల నేపథ్యంలో జలసౌధలో మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. కృష్ణా నదీజలాల్లో ప్రభుత్వంపై చేస్తున్న ఆరోపణలను ఖండించారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడం ద్వారా తెలంగాణ జల హక్కులను కాపాడటంతోపాటు నీటిపారుదల రంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలిపారు. ఇటీవల కేంద్ర మంత్ర